
సాక్షి
శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు
మంగళవారం ၊ 5 ၊ ఆగస్టు ၊ 2025



13,134 క్యూసెక్కుల వరద

సోమశిల జలాశయంలో 35.630 టీఎంసీలు ఉన్నాయి. ఇన్‌ఫ్లో 13,134 క్యూసెక్కులు ఉంది. దిగువకు 3,600, కండలేరుకు 3వేలు,ఉత్తరకాలువకు 370 క్యూసెక్కుల విడుదల చేస్తున్నారు.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10 గ్రా)	రూ.1,03,000
22 క్యారెట్ల ఆర్నమెంట్ (గ్రా)	రూ.9,310
3 శాతం జీఎస్టీతో	రూ.9,589
నవర (8 గ్రా)	రూ.76,712

గరిష్టం/కనిష్టం
38.2 /28.4

వాతావరణం

జిల్లాలో మంగళవారం వాతావరణం పాక్షికంగా మేఘావృతంగా ఉంటుంది. పగటి ఉష్ణోగ్రతలు అధికంగా ఉంటాయి. సోమవారం గాలిలో తేమ 60 శాతంగా నమోదైంది.

న్యూస్‌రీల్

డీఐఈఓగా కృష్ణారెడ్డి బాధ్యతల స్వీకరణ



డీఐఈఓను మర్యాద పూర్వకంగా కలిసిన అసోసియేషన్ నాయకులు

నెల్లూరు (టౌన్): స్థానిక స్టోన్‌హౌస్‌పేటలోని జిల్లా ఇన్‌స్పెక్షన్ ఎడ్యుకేషనల్ ఆఫీసర్ (డీఐఈఓ)గా సోమవారం బీవీ కృష్ణారెడ్డి బాధ్యతలు స్వీకరించారు. ఆయన పల్నాడు జిల్లాలోని పిడుగురాళ్లలోని జూనియర్ కళాశాలలో ప్రిన్సిపల్‌గా పని చేస్తూ పదోన్నతిపై నెల్లూరుకు వచ్చారు. ఫిజికల్ ఎడ్యుకేషన్ అసోసియేషన్ నాయకులు పాటూరు వేణుగోపాలరెడ్డి, జూనియర్ లెక్చరర్స్ ఇన్ లైబ్రరీ సైన్స్ అసోసియేషన్ నాయకులు బసివిరెడ్డి, బాలసుబ్బారెడ్డి తదితరులు డీఐఈఓ కృష్ణారెడ్డిని మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి అభినందించారు.

కేజీబీవీల్లో పీజీటీ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

నెల్లూరు (టౌన్): జిల్లాలోని మూడు కేజీబీవీల్లో పీజీటీ పోస్టులకు తాత్కాలికంగా గెస్ట్ ఫ్యాకల్టీ కింద మహిళా అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు సమగ్రశిక్ష ఏపీసీ వెంకటసుబ్బయ్య సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. సీతారామపురం కేజీబీవీలో కెమిస్ట్రీ, లింగసముద్రం కేజీబీవీలో ఫిజిక్స్, కలిగిరి కేజీబీవీలో ఎంపీహెచ్‌డబ్ల్యూ పోస్టులు ఉన్నాయన్నారు. నెలకు రూ.12 గౌరవ వేతనం ఇవ్వనున్నట్లు వెల్లడించారు. ఈ నెల 11వ తేదీ నాటికి 42 ఏళ్లు మించి ఉండరాదన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులకు 47 ఏళ్లు, విభిన్న ప్రతిభావంతుల అభ్యర్థులకు 52 ఏళ్లు మించకూడదన్నారు. సమగ్రశిక్ష కార్యాలయంలో దరఖాస్తులు తీసుకుని పూర్తి చేసి సంబంధిత కార్యాలయంలో ఇవ్వాలన్నారు.

స్వాతంత్ర దినోత్సవ వేడుకలకు అన్ని ఏర్పాట్లు చేయాలి

- కలెక్టర్ ఆనంద్



ఏర్పాట్లపై సమీక్షిస్తున్న కలెక్టర్ ఆనంద్

నెల్లూరురూరల్: 79వ స్వాతంత్ర దినోత్సవ వేడుకలను అత్యంత ఘనంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ ఆనంద్ సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని తిక్కన ప్రాంగణంలో ఏర్పాట్లపై సమీక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఎవరికి కేటాయించిన విధులను ఆయా శాఖల అధికారులు బాధ్యతతో, సమన్వయంతో కలిసికట్టుగా పని చేయాలన్నారు. అన్ని విద్యాసంస్థల్లో పండగ వాతావరణంలో స్వాతంత్ర దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగేలా విద్యా శాఖాధికారులు కృషి చేయాలన్నారు. అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై శకటాల ప్రదర్శన వినూత్నంగా ఉండేలా చూడాలన్నారు. ఈ సమావేశంలో జేసీ కార్తీక్, డీఆర్‌ఓ హుస్సేన్ సాహెబ్, ఆర్డీఓ అనూష, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ఆగిన పింఛన్ ఆపేసిన రీ వెరిఫికేషన్



➡ ఈ చిత్రంలో కనిపిస్తున్న ఆమె పేరు కోరికల చెన్నమ్మ. సుమారు 75 ఏళ్లుంటాయి. బుచ్చిరెడ్డిపాళెం మండలం కాగులపాడుకు చెందిన ఆమెకు ఒక కన్ను చూపు పూర్తిగా పోయింది. మరో కన్ను చూపు అంతంత మాత్రమే. సరిగా నడవలేదు. కూలీ పనులకు వెళ్లలేని వయోభారం. భర్త కూడా కొంత కాలం క్రితం కాలం చేశాడు. ఒంటరిగా ఉంటున్న ఆమెకు ఇప్పటి వరకు రూ.6 వేలు పింఛన్ వచ్చేది. నిరుపేదరాలైన ఆమెకు ఆగస్టు 1వ తేదీన పింఛన్ రాలేదు. సహాయకులతో కలిసి సచివాలయానికి వెళ్లి అడగ్గా, నీకు పింఛన్ ఆపేశారని, వికలాంగత్వాన్ని నిరూపించుకునేందుకు పెద్దాస్పత్రిలో ఏర్పాటు చేసిన రీ వెరిఫికేషన్ కేంద్రానికి వెళ్లలేదని చెప్పారు. తనకు ఈ సంగతి ఇప్పటి వరకు ఎవరూ చెప్పలేదని రచ్చ చేసింది. దీంతో సచివాలయ సిబ్బంది అప్పటికప్పుడు పెద్దాస్పత్రికి రీ వెరిఫికేషన్‌కు వెళ్లాలంటూ నోటీసు ఇచ్చారు.



➡ ఇతని పేరు ముత్యాల జనార్దన్. ఏఎస్‌పేట మండలం వేల్పులగుంట. అతనికి పోలియో వల్ల రెండు కాళ్లు చచ్చుబడ్డాయి. ఆయనకు ఈ నెల 1న పింఛన్ ఆపేసినట్లు సచివాలయ ఉద్యోగులు తెలిపారు. ఆయన కూడా పెద్దాస్పత్రికి రాగా ఇక్కడ రీ వెరిఫికేషన్ కేంద్రాన్ని మూసేయడంతో దిక్కుతోచలేదు. దీంతో ఆయన ఇది అన్యాయమని, ఎలాంటి పనికి పోలేని తనకు ప్రభుత్వం అన్యాయం చేసిందని, తమ ఉసురు తప్పదని బావురమన్నాడు. తనకు పింఛన్ ఇప్పించాలని వేడుకుంటున్నాడు.

➤➤ పెద్దాస్పత్రి చుట్టూ తిరుగుతున్న పింఛన్‌దారులు



రీ వెరిఫికేషన్ కోసం పెద్దాస్పత్రికి వచ్చిన బాధితులు

నెల్లూరు (అర్బన్): ఎన్నికలకు ముందు అధికారంలోకి వచ్చేందుకు కూటమి నేతలు దివ్యాంగులకు రూ.6 వేలు, బెడ్‌రిడన్ వారికి రూ.15 వేలు, వృద్ధాప్య పింఛన్ రూ.4 వేలు పెంచుతామని హామీ ఇచ్చింది. అధికారంలోకి వచ్చాక ప్రభుత్వం పింఛన్ పెంచినట్లు పెంచి అంతలోనే కోతలకు పూనుకుంది. అనర్హుల ఏరివేత పేరుతో అర్హులకు అన్యాయం చేయడానికి సిద్ధమైంది. జిల్లాలో 3,07,000 మంది సామాజిక పింఛన్‌దారులున్నారు. వారిలో దివ్యాంగులైన వారు 32 వేల మంది, బెడ్‌రిడన్ రోగులు 1,279 మంది ఉన్నారు. వీరిలో దశల వారీగా పింఛన్ కోత పెట్టాలని ప్రభుత్వం పన్నాగం పన్నింది. మొదటి రెండు నెలలు బెడ్‌రిడన్ రోగులకు, తర్వాత నాలుగు నెలలు దివ్యాంగులకు రీ వెరిఫికేషన్ చేయాలని ప్రణాళికను సిద్ధం చేశారు. అందులో భాగంగా డీఆర్‌డీఏ అధికారులు పింఛన్ వివరాలను ఎంపీడీఓ కార్యాలయానికి చేర్చారు. సచివాలయ సిబ్బంది ఆ జాబితా ప్రకారం లబ్ధిదారులకు లెటర్ ఇచ్చి పెద్దాస్పత్రికి పంపాల్సి ఉంది. అయితే సచివాలయ అధికారుల నిర్లక్ష్యంతో కొన్నిచోట్ల లబ్ధిదారులకు అసలు సమాచారమే ఇవ్వకపోవడంతో ఇటు వారంతా రీ వెరిఫికేషన్‌కు వెళ్లలేదు. ఇలా వెళ్లని వారికి మరొక అవకాశం కూడా ఇవ్వకుండా నిర్దాక్షిణ్యంగా పింఛన్ ఆపేశారు. రీ వెరిఫికేషన్ పేరుతో భారీగా కోత విధించినట్లు తెలుస్తోంది. అయితే ఇక్కడ రీ వెరిఫికేషన్ సెంటర్‌ను దాదాపు 20 రోజుల క్రితం ఆపేశారనే సమాచారంతో వారంతా దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. ఈ విషయమై పెద్దాస్పత్రి సూపరింటెండెంట్‌ను వివరణ కోరగా ఆస్పత్రికి వచ్చిన వారందరికీ రీ వెరిఫికేషన్ చేశామన్నారు. మళ్లీ ప్రభుత్వం అనుమతిస్తే రీవెరిఫికేషన్ చేస్తామని తెలిపారు.

నడవలేను పింఛన్ తొలగించొద్దు



నాకు రెండు కాళ్లు పనిచేయవు. నడవలేను. ఏ పని చేయలేను. ఇప్పటి వరకు పింఛన్ వస్తుంది. గత నెలలో రీ వెరిఫికేషన్ కోసం రాలేకపోయాను. తర్వాత పలు దఫాలుగా రీ వెరిఫికేషన్ కోసం తిరుగుతున్నాను. అయినా డాక్టర్లు ఇక్కడ చూడటం లేదు. నాకు పింఛన్ తొలగించవద్దు. అన్యాయం చేయొద్దు.

– బంధనాదం రవికుమార్, బీవీనగర్, నెల్లూరు

మాకు మరొక అవకాశం కల్పించాలి



నా బిడ్డ పేరు రజని. మా పాపకు చెవుడు. కళ్లు కనిపించవు. నడవలేదు. ముందు నెలలోనే రీ వెరిఫికేషన్‌కు వచ్చాం. తర్వాత నెలలో రమ్మన్నారు. వారం నుంచి తిరుగుతుంటే రీ వెరిఫికేషన్ కేంద్రం మూసేశాం.. డాక్టర్లు లేరు అంటున్నారు. నా బిడ్డకు పింఛన్ పోకుండా కాపాడాలి.

– వెంకటమ్మ, బాధితురాలి తల్లి , నెల్లూరు

రీ వెరిఫికేషన్‌కు సమయమిచ్చాం

అర్హులైన దివ్యాంగులకు అన్యాయం జరగకూడదనే ఉద్దేశంతో రీ వెరిఫికేషన్ కోసం చాలా సమయం ఇచ్చాం. ఎంపీడీఓలు, సచివాలయ సిబ్బంది, ఇతర ప్రభుత్వ సిబ్బంది ద్వారా దివ్యాంగులను సదరమ్ రీ వెరిఫికేషన్‌కు వెళ్లాలని తెలిపాం. నోటీసులు ఇచ్చాం. ఎవరైనా సదరమ్ క్యాంపునకు ఇచ్చిన తేదీ ప్రకారం వెళ్లకపోతే అది మా తప్పు కాదు కదా. ఇంకా ఎవరైనా అక్కడక్కడ మిగిలిపోయి ఉంటే వారికి కూడా న్యాయం చేసేందుకు రీ వెరిఫికేషన్ మళ్లీ చేయించేందుకు రాష్ట్ర సెర్ప్ ఉన్నతాధికారులను సంప్రదిస్తాను.

– నాగరాజకుమారి, డీఆర్‌డీఏ పీడీ

రాజకీయ కక్షతోనే నాపై అక్రమ కేసులు

- సీఐడీ విచారణలో కాకాణి వెల్లడి



సాక్షిప్రతినిధి, నెల్లూరు: రాజకీయ కక్షతోనే కూటమి ప్రభుత్వం నాపై అక్రమ కేసులు బనాయిస్తోంది. ప్రభుత్వ భూముల రికార్డుల తారుమారు కేసు ఆ కోవలోనిదేనని కాకాణి గోవర్ధన్‌రెడ్డి స్పష్టం చేశారు. సీఐడీ అధికారుల రెండు రోజుల కస్టడీలో కాకాణి లిఖిత పూర్వక సమాధానమిచ్చారు. కాకుటూరులోని 14.14 ఎకరాల భూమి, కుంకుమపూడిలో 1.60 సెంట్ల భూమికి సంబంధించి వెబ్‌ల్యాండ్‌లో అధికారికంగా జరిగిన కరెక్షన్స్‌పై ఆ నాటి తహసీల్దార్ శ్రీనివాసప్రసాద్ నాకు తెలియజేశారు. దీంతో వెంటనే కలెక్టర్, ఇతర జిల్లా ఉన్నతాధికారుల దృష్టికి విషయాన్ని తీసుకెళ్లి, దీని వెనుక ఎవరున్నా సరే లెక్క చేయకుండా తగిన చర్యలు చేపట్టాలని కోరాను. దీంతో అప్పట్లోనే క్రిమినల్ కేసు నమోదు చేశారు. బొద్దు మస్తానయ్య, బొద్దు శ్రీహరితో నాకు అసలు పరిచయమే లేదు. నన్ను వారిద్దరూ ఎన్నడూ కలవలేదు. ఈ రెండు రోజుల కస్టడీలో వాళ్లకు నన్ను చూపించి ఉంటే పూర్తిస్థాయిలో స్పష్టత వచ్చి ఉండేది. రాజకీయంగా నన్ను ఎదుర్కోలేక ఏదో రకంగా అప్రతిష్ట పాల్జేసేందుకు కుట్రలు పన్నారు. నా మీద తరచూ టీడీపీ శ్రేణులు, నా ప్రధాన ప్రత్యర్థి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి భూముల విషయంలో నాపై అసత్య ప్రచారాలు చేస్తున్నారని కాకాణి వెల్లడించినట్లు తెలిసింది.

కాకాణికి ముగిసిన సీఐడీ విచారణ

నెల్లూరు (లీగల్): ప్రభుత్వ భూముల రికార్డులను తారుమారు చేశారని వెంకటాచలం పోలీసులు నమోదు చేసిన అక్రమ కేసులో 14వ నిందితుడిగా ఆరోపణలు ఎదుర్కొంటున్న మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డికి రెండు రోజుల సీఐడీ పోలీసుల విచారణ సోమవారంతో ముగిసింది. కోర్టు ఆదేశాల మేరకు జిల్లా కేంద్ర కారాగారం నుంచి సోమవారం సీఐడీ పోలీసులు కాకాణిని కస్టడీకి తీసుకొని జైలు సమీపంలోని జిల్లా పోలీస్ ట్రైనింగ్ సెంటర్‌లో న్యాయవాది కూరపాటి మస్తాన్, మధ్యవర్తులుగా సర్వేపల్లి బిట్–2, చౌటపాళెం వీఆర్వోలు చల్ల సూర్యకుమార్, వేములచెడు సాంబశివరావు సమక్షంలో సీఐడీ ఇన్వెస్టిగేషన్ ఆఫీసర్ ఆర్ శ్రీనివాసరావు విచారణ చేపట్టారు. రెండో రోజు అడిగిన 12 ప్రశ్నలకు సమాధానమిచ్చారు. కోర్టు గడువు ముగియడంతో గోవర్ధన్‌రెడ్డికి వైద్య పరీక్షలు చేయించిన అనంతరం నెల్లూరు జిల్లా కేంద్ర కారాగారానికి తరలించారు. అక్కడి నుంచి వర్చువల్ విధానంలో నెల్లూరు 2వ అడిషనల్ జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టులో ప్రవేశ పెట్టారు.

కూటమి పాలనలో రైతుల ఆత్మహత్యలు



జేసీ కార్తీక్‌కు వినతిపత్రం అందజేస్తున్న చంద్రశేఖర్‌రెడ్డి, మేరిగ, కిలివేటి, విజయకుమార్‌రెడ్డి, పూజిత, గౌరి

- పంటలకు గిట్టుబాటు ధరల్లేవు
- ఎరువులు చూస్తే బ్లాక్ మార్కెట్ ధరలు
- అన్నదాత సుఖీభవ దగా
- గతేడాది ఎగ్గొట్టారు.. ఈ ఏడాది రూ.5 వేలే ఇచ్చారు
- ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి

నెల్లూరు (అర్బన్): కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రైతులు ఆత్మహత్యలు పెరిగాయని ఎమ్మెల్సీ, వైఎస్సార్‌సీపీ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి ఆరోపించారు. ఒక పక్క ఆరుగాలం పండించిన ఏ పంటకు గిట్టుబాటు కాదు కదా.. కనీసం మద్దతు ధర కూడా లభించక అప్పుల పాలయ్యారన్నారు. ఎరువులు చూస్తే బ్లాక్ మార్కెట్‌కు తరలించి టీడీపీ నేతలు సొమ్ము చేసుకుంటున్నారని విమర్శించారు. ఇప్పటికైనా రైతులను ఆదుకోవాలని కోరుతూ సోమవారం కలెక్టరేట్‌లో జరిగిన ప్రజాసమస్యల పరిష్కార వేదికలో ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్, మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య, నెల్లూరు రూరల్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆనం విజయకుమార్‌రెడ్డి కాకాణి కుమార్తె పూజితతో కలిసి జాయింట్ కలెక్టర్ కార్తీక్‌కి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి, ఆయన తనయుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలో ఉన్నప్పుడు సకాలంలో వర్షాలు కురిశాయన్నారు. రైతులకు విత్తనాలు, ఎరువులు అందుబాటులో ఉంచారన్నారు. గిట్టుబాటు ధరలు కల్పించారన్నారు. అప్పట్లో రైతులు ఎంతో సంతోషంగా ఉన్నారన్నారు. అయితే చంద్రబాబు అధికారం చేపట్టాక 2014–19 కాలంలో వర్షాలు లేక రైతులు భూములను అమ్ముకున్నారన్నారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వస్తే ఏటా రూ.20 వేలిస్తామని, తొలి ఏడాది ఎగనామం పెట్టారని, రెండో ఏడాది రూ.5 వేలు విదిలించారన్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చినప్పుడు రైతులకు రూ.12,500 ఇస్తామని చెప్పినా, రూ.13,500 ఇచ్చారని గుర్తు చేశారు. తమ ప్రభుత్వంలో రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతులను అన్ని విధాలుగా ఆదుకున్నామన్నారు. రైతుల పంటలకు ఉచితంగా ఇన్సూరెన్స్ కల్పించామన్నారు. ఇప్పుడు దాన్ని ఎత్తేశారన్నారు. ప్రభుత్వం వీటన్నింటిని వదిలేసి వైఎస్సార్‌సీపీ నేతలపై అక్రమ కేసులు పెట్టడం, వారిని జైల్లో పెట్టడమే పనిగా కక్ష సాధింపు చర్యల్లో మునిగి తేలుతుందన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం బ్లాక్ మార్కెట్ దందాను అరికట్టి రైతుల సమస్యలు పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు మొయిళ్ల గౌరి, ఊటుకూరు నాగార్జున తదితరులు పాల్గొన్నారు.

నవ్వానంట.. అందుకే కేసు పెట్టారు

- బీసీ నేతనని ఆరు గంటలు విచారించారు
- మాజీ మంత్రి డాక్టర్ పి. అనిల్‌కుమార్‌యాదవ్



విచారణానంతరం మీడియాతో మాట్లాడుతున్న అనిల్‌కుమార్‌యాదవ్



అనిల్‌కుమార్‌యాదవ్‌కు మద్దతుగా వచ్చిన అభిమానులు, కార్యకర్తలు

సాక్షిప్రతినిధి, నెల్లూరు: 'ఈ కూటమి ప్రభుత్వంలో నవ్వడం, చప్పట్లు కొట్టడం కూడా తప్పే. మాజీమంత్రి నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి మీటింగ్‌లో నేను నవ్వానంట.. అందుకే నాపై కేసు బనాయించారంట' అని మాజీ మంత్రి డాక్టర్ పోలుబోయిన అనిల్‌కుమార్‌యాదవ్ అన్నారు. సోమవారం మూలాపేటలోని నెల్లూరు రూరల్ డీఎస్పీ కార్యాలయంలో విచారణ అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. గత నెలలో కోవూరులో జరిగిన వైఎస్సార్‌సీపీ కార్యకర్తల సమావేశంలో ప్రసన్న పిలుపు మేరకు కార్యక్రమానికి హాజరయ్యాను. ఆ రోజు స్థానిక ఎమ్మెల్యే గురించి ప్రసన్నన్న ఏదో మాట్లాడానని, అదే రోజు రాత్రి ఆయన ఇంట్లో కొందరు విధ్వంసం సృష్టించారు. ఇది జరిగిన మరుసటి రోజు తన ప్రతిష్టకు భంగం కలిగిందని స్థానిక ఎమ్మెల్యే పోలీసులకు ఫిర్యాదు చేయడం ప్రసన్నన్నపై కేసు నమోదు చేయడం జరిగింది. దాడి ఘటనపై పార్టీ నేతలందరం కలిసి ప్రసన్నన్నతో మాట్లాడాం. రెండురోజుల అనంతరం సమావేశంలో నవ్వామని నాతోపాటు మరో నలుగురి పేర్లను కేసులో చేర్చడం జరిగింది. ఇప్పటికే ప్రసన్నతోపాటు మరికొందరు విచారణకు హాజరయ్యారు. నన్ను పిలవగా గత నెల 30వ తేదీ వస్తానని చెప్పాను. అయితే పోలీసులే 30వ తేదీ కాదు 4వ తేదీ రమ్మని చెప్పడంతో సోమవారం విచారణకు హాజరయ్యాను. 36 ప్రశ్నలు అడిగారు. సంబంధం లేని విషయాలను అడిగారు. తెలియదని చెప్పాను. పది నిమిషాల్లో ప్రశ్నలన్నింటికి లిఖిత పూర్వక సమాధానమిచ్చాను. పీహెచ్‌డీ అంటే ఏమిటని, ప్రసన్నకుమార్‌రెడ్డి మాటలను సమర్థిస్తున్నారా? అని ప్రశ్నించారు. ఆయన మాట్లాడిన మాటల్లో ఉద్దేశం ఆయన్ను అడగాలి తప్ప నాకు ఏమి తెలుసని పోలీసులకు చెప్పాను. పీహెచ్‌డీ అంటే గ్రాడ్యుయేషన్ పూర్తయిన తర్వాత చదివే ఉన్నత చదువని చెప్పాను. విచారణ పేరుతో ఆరు గంటల పాటు కూర్చొపెట్టి కూటమి నేతలు శునకానందం పొందారన్నారు. ఈ ప్రభుత్వంలో నవ్వినా, చప్పట్లు కొట్టినా, ఈలలు వేసినా తప్పే. మరి ఏం చేయాలో వారె చెప్పాలి. ప్రసన్నను మూడు గంటలు కూర్చొబెడితే నాపై అభిమానం, ప్రేమ ఎక్కువగా ఉండడంతో మరో మూడు గంటలు అదనంగా కూర్చొబెట్టారు. కూటమి ప్రభుత్వం బీసీ నాయకులను టార్గెట్ చేసింది. సంబంధం లేని వాటిని తీసుకువచ్చి అనిల్‌కుమార్‌యాదవ్‌కు అంటగుడుతున్నారు. ఈ కేసులో ప్రసన్నను మూడు గంటలు విచారించి నన్ను ఆరుగంటలు విచారించడం చూస్తుంటే ఈ ప్రభుత్వం బీసీలపై కక్ష సాధిస్తోందని స్పష్టమవుతుంది.

పోలీసుల తీరుపై అసహనం

నెల్లూరు (క్రైమ్): అనిల్‌కుమార్‌యాదవ్‌కు మద్దతుగా పెద్ద ఎత్తున వైఎస్సార్‌సీపీ శ్రేణులు, అభిమానులు వచ్చే అవకాశం ఉందని సమాచారం అందుకున్న పోలీసు అధికారులు డీఎస్పీ కార్యాలయం వద్ద భారీ బందోబస్తును ఏర్పాటు చేశారు. బట్వాడిపాళెం జంక్షన్, రామయ్యబడి సమీపంలో, లిటిల్ ఏంజిల్స్ స్కూల్ సమీపంలో బారికేడ్లను ఏర్పాటు చేసి ఉదయం నుంచే అధికారులు రాకపోకలను నిషేధించారు. ఈ క్రమంలో అనిల్‌కుమార్‌యాదవ్ తన న్యాయవాదులతో కలిసి ఉదయం 10.05 గంటలకు నెల్లూరు రూరల్ డీఎస్పీ కార్యాలయం వద్దకు చేరుకున్నారు. అప్పటికే అక్కడ పెద్ద సంఖ్యలో ఉన్న వైఎస్సార్‌సీపీ శ్రేణులు, అభిమానులను ఆయన పలకరించారు. కేవలం అనిల్‌కుమార్‌యాదవ్‌తో పాటు న్యాయవాదులను లోనికి అనుమతించారు. దీంతో అభిమానులు, వైఎస్సార్‌సీపీ శ్రేణులు కార్యాలయం బయట చెట్ల కింద, సమీపంలోని కార్ల వద్ద నిలుచున్నారు. అక్కడి నుంచి దూరంగా వెళ్లిపోవాలంటూ పోలీసులు వారిపట్ల దురుసుగా ప్రవర్తించారు. కొందరు వృద్ధులు సమీపంలోని దుకాణాల వద్ద కూర్చొని ఉండగా బలవంతంగా వారిని అక్కడి నుంచి పంపివేశారు. అనిల్‌కుమార్‌ను విచారణ అనంతరం కలిసేందుకు ఎమ్మెల్సీ మేరిగ మురళీ, మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య నెల్లూరురూరల్ డీఎస్పీ కార్యాలయం వద్దకు వెళుతుండగా పోలీసులు అడ్డుకున్నారు. అనుమతులు లేవంటూ అక్కడి నుంచి వారిని పంపివేశారు. పోలీసుల తీరుపై వారు అసహనం వ్యక్తం చేశారు.

కుల దూషణ కేసులో ఒకరికి ఆర్నెళ్ల జైలు

నెల్లూరు (లీగల్): విక్రయించిన రొయ్యల నగదు ఇవ్వకుండా మోసం చేసి, కులం పేరుతో దూషించాడని నమోదైన కేసులో నేరం రుజువు కావడంతో నెల్లూరురూరల్ మండలం పెద్దచెరుకూరు పంచాయతీ సిరి గార్డెన్స్‌కు చెందిన చిరమణ సతీష్‌రెడ్డికి ఆర్నెళ్ల జైలు శిక్షతోపాటు వెయ్యి రూపాయలు జరిమానా విధిస్తూ నెల్లూరు ప్రత్యేక ఎస్సీ, ఎస్టీ కోర్టు న్యాయమూర్తి ఎన్. సరస్వతి సోమవారం తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ కథనం మేరకు.. టీపీ గూడూరు మండలం కొత్తపాళెంకు చెందిన పొట్లూరు వెంకటశేషయ్య మూడు ఎకరాల్లో రొయ్య గుంటల సాగు చేశాడు. సాగు చేసిన రొయ్యలను నెల్లూరు కొత్త కాలువ సెంటర్ దగ్గర ఉన్న శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర ఫిష్ ప్యాకింగ్ యజమాని సతీష్‌రెడ్డికి 8 ఏప్రిల్ 2017న రూ.11,91,549లకు అమ్మాడు. ఇందుకు ఆయన రూ.25,000 అడ్వాన్స్‌గా చెల్లించాడు. మిగతా మొత్తం రెండు నెలల్లో చెల్లిస్తానని నమ్మబలికాడు. ఈ నేపథ్యంలో 8–6–2017 సాయంత్రం 6 గంటల ప్రాంతంలో సతీష్‌రెడ్డి ఇంటికి వెళ్లి మిగతా నగదు గురించి అడిగాడు దీంతో ఆగ్రహించిన సతీష్‌రెడ్డి పైకం ఇవ్వకుండా మోసం చేసి అసభ్యకరంగా కులం పేరుతో పొట్లూరు వెంకటశేషయ్యను దూషించాడు. ఈ ఘటనపై శేషయ్య అదే రోజు నెల్లూరు రూరల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు అనంతరం నిందితుడు సతీష్‌రెడ్డిపై కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. విచారణలో నేరం రుజువు కావడంతో పైమేరకు శిక్ష, జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పారు ప్రాసిక్యూషన్ తరపున స్పెషల్ పీపీ అజయ్ ప్రేమకుమార్ కేసు వాదించారు.

నా కుమారుడు ఇంట్లో నుంచి గెంటేశాడు

- పోలీసుల వద్ద వృద్ధుడి ఆవేదన
- ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 84 ఫిర్యాదులు


వృద్ధురాలి సమస్య తెలుసుకుంటున్న డీఎస్పీ సింధుప్రియ

నెల్లూరు(క్రైమ్): 'నా బాగోగులు చూసుకుంటానని కుమారుడు వెంకటేశ్వరరెడ్డి ఇల్లు, పొలం తీసుకున్నాడు. నాకు కేన్సర్ వచ్చిందని ఇంట్లో నుంచి గెంటేశాడు. ప్రస్తుతం బాడుగింట్లో ఉంటున్నా. వాళ్లు కూడా ఖాళీ చేయాలని చెప్పారు. దీన స్థితిలో ఉన్నాను. కుమారుడు నా బాగోగులు చూసుకునేలా చర్యలు తీసుకోవాలి' అని జలదంకి ప్రాంతానికి చెందిన ఓ వృద్ధుడు కోరాడు. సోమవారం నెల్లూరులోని ఉమేష్‌చంద్ర కాన్ఫరెన్స్ హాల్లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం జరిగింది. 84 మంది విచ్చేసి తమ సమస్యలను నగర డీఎస్పీ పి.సింధుప్రియ దృష్టికి తీసుకెళ్లారు. కార్యక్రమంలో మహిళా పోలీస్‌స్టేషన్ డీఎస్పీ చెంచురామారావు, లీగల్ అడ్వైజర్ శ్రీనివాసులురెడ్డి, ఎస్బీ–2 ఇన్‌స్పెక్టర్ బి.శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఫిర్యాదుల్లో కొన్ని..

- కోవూరు పరిధికి చెందిన ప్రవీణ్‌కుమార్ నా ఇంటిపై సోలార్ ప్యానల్ బిగిస్తానని రూ.2.46 లక్షలు తీసుకుని మోసగించాడని కావలికి చెందిన ఓ వ్యక్తి ఫిర్యాదు చేశాడు.
- కలువాయి పరిధికి చెందిన సంధ్య సాఫ్ట్‌వేర్ ఉద్యోగాలు ఇప్పిస్తానని రూ.5 లక్షలు తీసుకుని మోసగించినట్లు వింజమూరు, మర్రిపాడుకు చెందిన వారు ఫిర్యాదు చేశారు.
- దశారి మునికృష్ణయ్య రూ.29 లక్షల విలువైన ధాన్యాన్ని తీసుకెళ్లి నగదు ఇవ్వకుండా ఇబ్బందులు పెడుతున్నారని వెంకటాచలం ప్రాంతానికి చెందిన రైతులు వినతిపత్రం ఇచ్చారు.
- భర్త, అత్తమామలు అదనపుకట్నం కోసం వేధిస్తున్నారు. విచారించి చర్యలు తీసుకోవాలని కావలికి చెందిన ఓ మహిళ విన్నవించారు.
- నేను లివర్ వ్యాధితో బాధపడుతున్నా. కుమారుడు నా బాగోగులు పట్టించుకోవడం లేదు. విచారించి న్యాయం చేయాలని నెల్లూరు రూరల్ పరిధికి చెందిన ఓ వృద్ధుడు కోరాడు.

పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు

బ్రాయిలర్:	రూ.107
లేయర్	రూ.112
బ్రాయిలర్ చికెన్:	రూ.200
స్కిన్‌లెస్ చికెన్:	రూ.222
లేయర్ చికెన్:	రూ.190



నిమ్మ ధరలు (కిలో)

పెద్దవి : రూ.25
సన్నవి : రూ.15
పండ్లు : రూ.5

మేడం.. సెల్‌ఫోన్లు పనిచేయడం లేదు

- మూటగట్టి అప్పగించిన అంగన్‌వాడీ కార్యకర్తలు


పనిచేయని ఫోన్లను మూటగట్టి అధికారులకు ఇస్తూ..

నెల్లూరు(వీఆర్సీసెంటర్): సెల్‌ఫోన్లు పనిచేయడం లేదంటూ అంగన్‌వాడీ కార్యకర్తలు వాటిని అధికారులకు అందజేశారు. ఎన్నికల సమయంలో కూటమి నేతలు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేస్తూ నెల్లూరులోని ఐసీడీఎస్ సీపీడీఓ కార్యాలయం వద్ద సోమవారం అంగన్‌వాడీలు నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా సీఐటీయూ నగర, రూరల్ కార్యదర్శులు నాగేశ్వరరావు, ప్రసాద్ మాట్లాడుతూ ఫోన్లు పనిచేయకపోవడంతో అంగన్‌వాడీలు ఒత్తిడి తట్టుకోలేక మానసిక ఆందోళనకు గురవుతున్నారని చెప్పారు. ప్రభుత్వం, అధికారులు స్పందించి ఒకే యాప్‌గా రూపొందించి కొత్త ట్యాబ్‌లను ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనంతరం పనిచేయని ఫోన్లను అంగన్‌వాడీలు మూటగట్టి అందజేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ వర్కర్స్,హెల్పర్స్ యూనియన్ నగర అధ్యక్ష, కార్యదర్శులు రజిని, కామాక్షమ్మ, మల్లెమ్మ, సంపూర్ణ, రత్నమ్మ, నాగభూషణమ్మ, ఉమాదేవి, ఉష, సుమతి, కల్పన తదితరులు పాల్గొన్నారు.

నగరంలో పోలీసుల స్పెషల్ డ్రైవ్


వివరాలు తెలుసుకుంటున్న ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరావు

నెల్లూరు(క్రైమ్): నెల్లూరు నగరంలో నేర నియంత్రణ, అసాంఘిక కార్యకలాపాల కట్టడిలో భాగంగా ఆదివారం అర్ధరాత్రి పోలీసు అధికారులు స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. అన్ని కూడళ్లు, జాతీయ రహదారి ప్రవేశం తదితర ప్రాంతాల్లో విస్తృతంగా వాహన తనిఖీలు చేపట్టారు. అతివేగం, మైనర్ డ్రైవింగ్, ఓవర్ లోడింగ్, ట్రిపుల్ రైడింగ్, సెల్ ఫోన్ డ్రైవింగ్‌పై భారీ జరిమానాలు విధించారు. మద్యం మత్తులో వాహనాలు నడుపుతున్న ఎనిమిది మందిపై కేసులు నమోదు చేశారు. సరైన పత్రాల్లేని ఆరు వాహనాలను సీజ్ చేసి పోలీస్‌స్టేషన్లకు తరలించారు. ఈ డ్రైవ్‌లో నగర ఇన్‌స్పెక్టర్లు చిట్టెం కోటేశ్వరరావు, జి.వేణుగోపాల్‌రెడ్డి, జి.దశరథరామారావు, కె.శ్రీనివాసరావు, కె.సాంబశివరావు, ఎస్సైలు తదితరులు పాల్గొన్నారు.

500 దాటిన వినతులు

- కలెక్టరేట్‌లో 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక'


వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్, ఇతర అధికారులు

నెల్లూరు రూరల్: నెల్లూరు కలెక్టరేట్‌లోని తిక్కన ప్రాంగణంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం జరిగింది. ఈసారి వినతుల సంఖ్య 500 దాటింది. కలెక్టర్ ఆనంద్, జేసీ కార్తీక్, డీఆర్వో హుస్సేన్‌సాహెబ్, జెడ్పీ సీఈఓ మోహన్‌రావు, జిల్లా పంచాయతీ అధికారి శ్రీధర్‌రెడ్డి ప్రజల అర్జీలను స్వీకరించారు. మొత్తం 566 అర్జీలు అందినట్లు అధికారులు తెలిపారు. రెవెన్యూ శాఖవి 205, సర్వే ల్యాండ్ రికార్డ్స్‌వి 32, మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్‌వి 48, పంచాయతీరాజ్‌వి 51, స్కూల్ ఎడ్యుకేషన్‌వి 22, పోలీస్ శాఖవి 95 తదితరులున్నాయి.

యాక్సిస్ బ్యాంక్ కుంభకోణంపై..


మాట్లాడుతున్న నేతలు

యాక్సిస్ బ్యాంక్‌లో జరిగిన రుణాల కుంభకోణంపై విచారణ జరిపి నిందితులను అరెస్ట్ చేయాలని బ్యాంక్ బాధితుల పోరాట కమిటీ తరఫున యానాదుల సంక్షేమ సంఘం రాష్ట్రాధ్యక్షుడు కేసీ పెంచలయ్య, సీపీఐ నేత రామరాజు, ఇంకా కొప్పోలు రఘు కోరారు. కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ విచారణను త్వరితగతిన చేయాలన్నారు. నగదును రికవరీ చేసి బాధితులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

శాపంగా మారిన అధికారుల తప్పు



2018 జూలైలో రెవెన్యూ అధికారులు మా భూమిని వన్‌బీ, అడంగళ్లలో నాగమ్మ, జయమ్మ పేరుపై మార్చేశారు. ఆ భూమి వేరే వారి పేరుతో రిజిస్ట్రేషన్ అయినట్లు చూపుతున్నారు. మా వద్ద డాక్యుమెంట్లు ఉన్నాయి. నాగమ్మ, జయమ్మ కూడా ఆ భూమి తమది కాదని చెప్పారు. తప్పును సరిదిద్దాలని తహసీల్దార్ కార్యాలయం చుట్టూ తిరిగాం. కలెక్టరేట్‌లో 24 సార్లు అర్జీలు ఇచ్చినా సమస్య పరిష్కరించడం లేదన్నారు.

– దోరసాల నాగిరెడ్డి, నవీన్, శెట్టిసముద్రం గ్రామం, మర్రిపాడు మండలం

శ్మశాన స్థలాన్ని కూడా వదల్లేదు


విచారణ జరపాలని కోరుతూ..

రూ.కోట్ల విలువైన స్థలంతోపాటు శ్మశానాన్ని కూడా ఆక్రమించారని కావలి మండలం రుద్రకోట దళితులు కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు. వారు మాట్లాడుతూ అధికార పార్టీలో ఉన్న పులుసు గోపీ అనే వ్యక్తి జాతీయ రహదారి పక్కన సుమారు రూ.21 కోట్ల విలువైన 21 ఎకరాల భూమికి తన కుటుంబం పేరుతో డీ పట్టా తెచ్చుకున్నాడన్నారు. రెవెన్యూ అధికారులను మేనేజ్ చేశాడన్నారు. శ్మశాన స్థలాన్ని ఆక్రమించినట్లు ఆరోపించారు.

కబ్జా చేయాలని చూస్తున్నారు



ప్రభుత్వం ఇచ్చిన స్థలంలో ఇల్లు కట్టుకుని నివాసం ఉంటున్నాం. అధికార పార్టీకి చెందిన పోలయ్య అనే వ్యక్తి స్థలాన్ని కబ్జా చేయాలని చూస్తున్నాడు. స్థలంలో పెరిగిన కంపచెట్లను సైతం కొట్టనివ్వడం లేదు. పోలయ్య ఎమ్మెల్యే పీఏకు బాగా తెలిసిన వ్యక్తి కావడంతో తహసీల్దార్‌కు అర్జీలు ఇచ్చినా పట్టించుకోవడం లేదు. కలెక్టరేట్‌లో మూడుదఫాలుగా అర్జీలిస్తున్నాను.

– తురిమెర్ల శ్రీనివాసులు, శంఖవరం, వింజమూరు మండలం

వైఎస్ జగన్‌ను కలిసిన ఎమ్మెల్సీ పర్వతరెడ్డి


జగన్‌మోహన్‌రెడ్డితో చంద్రశేఖర్‌రెడ్డి

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని తాడేపల్లిలో ఆ పార్టీ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్, నెల్లూరు నగర నియోజకవర్గ ఇన్‌చార్జి, ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి సోమవారం కలిశారు. అనంతరం ఎమ్మెల్సీ జిల్లాలో పరిస్థితులు, ఇటీవల నెలూరులో జరిగిన పర్యటన తదితర విషయాలను వెల్లడించారు. 11 నియోజకవర్గాల ఇన్‌చార్జిల సమష్టి కృషితో కార్యక్రమం విజయవంతమైందని జగనన్నకు చెప్పినట్లు ఎమ్మెల్సీ వెల్లడించారు. టీడీపీ ఆంక్షలు విధించి ప్రజలు రాకుండా రోడ్లు తవ్వించినా ప్రజలు పెద్దఎత్తున వచ్చారన్నారు. ఆయన నెల్లూరుకు రావడంతో కార్యకర్తల్లో నూతనోత్సాహం వచ్చిందన్నారు. జిల్లాలో ఇప్పటికే పార్టీ బలోపేతమైందని, జగన్‌మోహన్‌రెడ్డికి ఆదరణ పెరిగిందన్నారు.

జీఎస్టీ రిజిస్ట్రేషన్లు పెరిగేలా చర్యలు

- కలెక్టర్ ఆనంద్


మాట్లాడుతున్న కలెక్టర్ ఆనంద్

నెల్లూరు రూరల్: జిల్లాలో జీఎస్టీ రిజిస్ట్రేషన్లు పెరిగేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆనంద్ ఆదేశించారు. నెల్లూరు కలెక్టరేట్‌లోని తిక్కన ప్రాంగణంలో సోమవారం వాణిజ్య పన్నులు, వివిధ ప్రభుత్వ శాఖల మధ్య సమన్వయ కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రూ.40 లక్షల (వస్తువులు), రూ.20 లక్షల (సేవలు) టర్నోవర్ దాటిన వ్యాపార సంస్థలను జీఎస్టీ పరిధిలోకి తీసుకురావాలన్నారు. అటువంటి సంస్థల సమాచారం వాణిజ్య పన్నుల శాఖకు అందించాలన్నారు. అదేవిధంగా మున్సిపల్ కమిషనర్లు, జిల్లా రిజిస్ట్రార్, రెవెన్యూ అధికారులు పన్ను బకాయిదారుల ఆస్తుల వివరాలను వారికి ఇవ్వాలన్నారు. వస్తువుల అక్రమ రవాణాను అరికట్టేందుకు రవాణా, మైనింగ్ శాఖలు వాణిజ్య పన్నుల శాఖతో సమన్వయంతో పనిచేయాలని సూచించారు. సమావేశంలో వాణిజ్య పనుల శాఖ జాయింట్ కమిషనర్ వై.కిరణ్ కుమార్, డిప్యూటీ కమిషనర్ ఎం.సత్య ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

నెల్లూరులో 30 పోలీస్ యాక్ట్

నెల్లూరు(క్రైమ్): నెల్లూరు నగరంలో ఈనెల 31వ తేదీ వరకు 30 పోలీస్ యాక్ట్ అమలులో ఉంటుందని డీఎస్పీ పి.సింధుప్రియ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. అనుమతి లేకుండా ర్యాలీలు, బహిరంగ సమావేశాలు, నిర్వహించరాదన్నారు. నిబంధనలు ఉల్లంఘిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ప్రజాభిప్రాయం తప్పనిసరి

- జేసీ కార్తీక్


మాట్లాడుతున్న జేసీ కార్తీక్

నెల్లూరు రూరల్: ప్రజా సమస్యల పరిష్కార వేదిక అర్జీల పరిష్కారంపై తప్పనిసరిగా ప్రజాభిప్రాయం తీసుకోవాలని జేసీ కె.కార్తీక్ తెలిపారు. కలెక్టరేట్ నుంచి సోమవారం వివిధ అంశాలపై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ అర్జీలపై ఆయా సచివాలయాల సిబ్బంది తప్పనిసరిగా ప్రజల అభిప్రాయాలను తెలుసుకుని యాప్‌లో నమోదు చేయాలని ఆదేశించారు. దీనిపై ఎంపీడీఓలు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. పీ4లో మార్గదర్శులు, బంగారు కుటుంబాల ఎంపిక ప్రక్రియను వేగవంతం చేయాలన్నారు. ఇందుకూరుపేట మండలం 1,260 బంగారు కుటుంబాలను, 261 మార్గదర్శులను ఎంపిక చేసి మొదటి స్థానంలో ఉందన్నారు. గృహ నిర్మాణాలు, ఉపాధి పనుల్లో పురోగతి సాధించాలన్నారు. హౌసింగ్‌లో ఉపాధి హామీని అనుసంధానిస్తూ 90 రోజుల పనిదినాలు కల్పించాలన్నారు. మండల అధికారులు ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు. కాన్ఫరెన్స్‌లో డీఆర్వో హుస్సేన్‌సాహెబ్, జెడ్పీ సీఈఓ మోహన్‌రావు, హౌసింగ్, డ్వామా పీడీలు వేణుగోపాల్, గంగాభవాని, విద్యుత్ శాఖ ఎస్ఈ విజయన్, సమగ్ర శిక్ష ఏపీసీ వెంకటసుబ్బయ్య, నెల్లూరు ఆర్డీఓ అనూష తదితరులు పాల్గొన్నారు.

విశ్రాంత పోస్టల్ ఉద్యోగి ఇంట్లో చోరీ


చిందరవందరగా పడేసిన వస్తువులు

కావలి(జలదంకి): కావలి మండలం ఆనెమడుగు పంచాయతీ మొండిదిన్నెపాళెంలో విశ్రాంత పోస్టల్ ఉద్యోగి ద్రోణాదుల వెంకట సుబ్రహ్మణ్యం ఇంట్లో చోరీ జరిగింది. సోమవారం బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. వివరాలు.. ఈనెల ఒకటో తేదీన బంధువులకు అనారోగ్యంగా ఉందని తెలియడంతో సుబ్రహ్మణ్యం, ఆయన భార్య సామ్రాజ్యం హైదరాబాద్‌కు వెళ్లారు. సుబ్రహ్మణ్యం పెద్ద కుమారుడు లండన్‌లో ఉండగా రెండో కుమారుడు గిరి కావలిలో ఉంటున్నాడు. 2వ తేదీన అతను మొండిదిన్నెపాళెంలోని ఇంటికెళ్లి మొక్కలకు నీరు పట్టి సాయంత్రం వరకు ఉండి తిరిగి కావలికి వచ్చాడు. ఆదివారం గిరి మళ్లీ గ్రామానికి వెళ్లాడు. ఇంటి తాళాలు పగులగొట్టి ఉన్నాయి. బీరువాను తెరిచి వస్తువులను చిందవందరగా పడేసి ఉండటంతో తల్లిదండ్రులకు సమాచారం అందించాడు. అనంతరం పోలీసులకు ఫిర్యాదు చేశారు. సోమవారం సుబ్రహ్మణ్యం దంపతులు చోరీకి గురైన వస్తువుల వివరాలను తెలిపారు. రెండు బీరువాల్లో ఉన్న 20 సవర్ల బంగారు ఆభరణాలు, 1.5 కిలోల వెండి వస్తువులు, రూ.11 వేల నగదుతోపాటు హుండీల్లోని సుమారు రూ.30 వేల నగదు చోరీ అయిందన్నారు. కావలి రూరల్ ఎస్సైలు బాజీబాబు, కృష్ణయ్య ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. నెల్లూరు నుంచి క్లూస్‌టీమ్‌ను పిలిపించి వేలిముద్రలు సేకరించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు

నెల్లూరు(అర్బన్): జిల్లాలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని కలెక్టర్ ఆనంద్ వైద్యశాఖాధికారులను ఆదేశించారు. సోమవారం సాయంత్రం కలెక్టరేట్‌లో ఆశాఖ ఆధ్వర్యంలో రూపొందించిన కీటక జనిత వ్యాధుల నియంత్రణకు సంబంధించిన వాల్‌పోస్టర్లను కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాల వల్ల నీరు నిల్వ ఉండి దోమలు ఉత్పత్తి పెరిగితే డెంగీ, మలేరియా లాంటి జబ్బులు విస్తరిస్తాయన్నారు. పంచాయతీరాజ్, ఆర్‌డబ్ల్యూఎస్ శాఖల సహకారంతో వైద్యశాఖ ప్రత్యేక ప్రణాళికను రూపొందించి అందుకనుగుణంగా వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలన్నారు. గ్రామాల్లో పారిశుద్ధ్య కార్యక్రమాలు ముమ్మరంగా చేయించాలని పంచాయతీ అధికారిని ఆదేశించారు. డీఎంహెచ్ఓ సుజాత, జిల్లా మలేరియా నివారణాధికారి హుస్సేనమ్మలు మాట్లాడుతూ లార్వా నివారణకు 73 నీటి నిల్వ ప్రాంతాల్లో 2.87 లక్షల గంబూసియా చేపలను వదిలామన్నారు. 184 హాస్టళ్లలో దోమల నివారణకు స్ప్రే కార్యక్రమాలు చేపట్టామన్నారు. కార్యక్రమంలో జిల్లా టీబీ నివారణ అధికారి డాక్టర్ ఖాదర్‌వలీ, ఎన్టీఆర్ వైద్యసేవ కో–ఆర్డినేటర్ డాక్టర్ సుధీర్‌కుమార్, కమిషనర్ నందన్, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ కనకాద్రి తదితరులు పాల్గొన్నారు.

పోలీసుల కళ్లుగప్పి తిరుగుతుండగా..

- గంజాయి రవాణాదారుడి అరెస్ట్


వివరాలు వెల్లడిస్తున్న ఇన్‌స్పెక్టర్ కోటేశ్వరరావు

నెల్లూరు(క్రైమ్): మూడున్నరేళ్ల క్రితం ఎస్ఈబీ – 2 స్టేషన్‌లో సెంట్రీని గాయపరిచి పరారైన గంజాయి స్మగ్లర్‌ను ఎట్టకేలకు పోలీసులు అరెస్ట్ చేశారు. నెల్లూరు చిన్నబజారు పోలీస్‌స్టేషన్‌లో సోమవారం ఇన్‌స్పెక్టర్ చిట్టెం కోటేశ్వరరావు వివరాలను వెల్లడించారు. నాటి ఎస్ఈబీ – 2 ఇన్‌స్పెక్టర్ వి.వెంకటేశ్వరరావు రూట్‌వాచ్‌లో భాగంగా తన సిబ్బందితో కలిసి 2022 జనవరి 7 రాత్రి నుంచి 8వ తేదీ తెల్లవారుజాము వరకు వెంకటాచలం టోల్‌ప్లాజా వద్ద వాహన తనిఖీలు నిర్వహించారు. ఆర్టీసీ బస్సులో గంజాయిని అక్రమంగా తరలిస్తున్న ఒడిశా రాష్ట్రానికి చెందిన జయద్రథా బిశ్వాస్‌ను అదుపులోకి తీసుకున్నారు. 10.500 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని శివగిరికాలనీలోని ఎస్ఈబీ స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేశారు. బాత్‌రూమ్‌కు వెళ్లాలని అతను సెంట్రీ కానిస్టేబుల్ రవిని కోరాడు. తీసుకెళ్తున్న సమయంలో రవిపై దాడి చేసి పరారయ్యాడు. అదేరోజు ఇన్‌స్పెక్టర్ పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు. నిందితుడు తప్పించుకుని తిరుగుతుండగా కోటేశ్వరరావు ఆదేశాల మేరకు ఎస్సై అయ్యప్ప తన సిబ్బందితో ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేశారు. ఒడిశా అటవీ ప్రాంతంలో ముమ్మర గాలింపు చర్యలు చేపట్టారు. ఆదివారం జయద్రథా బిశ్వాస్‌ను అరెస్ట్ చేసి నెల్లూరుకు తీసుకొచ్చారు. నిందితుడిని అరెస్ట్ చేయడంలో ప్రతిభ చూపిన కోటేశ్వరరావు, ఎస్సై అయ్యప్ప, సిబ్బంది ఎస్బీ శ్యామ్‌ప్రసాద్, ఎం.సుబ్బారావును ఏఎస్పీ సీహెచ్ సౌజన్య అభినందించారు.


ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహిద్దాం

- వ్యవసాయ శాఖ జేడీ సత్యవాణి


మాట్లాడుతున్న జేడీ సత్యవాణి

నెల్లూరు(అర్బన్): ఆరోగ్యాన్ని కాపాడుకునేందుకు పురుగు మందులు, యూరియా ఆధారిత ఎరువులు వాడకుండా సహజమైన ఎరువులతో పండించే ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులను ప్రతిఒక్కరూ ప్రోత్సహించాలని వ్యవసాయ శాఖ జేడీ సత్యవాణి అన్నారు. సోమవారం ఆమె కలెక్టరేట్ ఆవరణలో ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులను ప్రారంభించి మాట్లాడారు. ప్రమాదకరమైన జబ్బులు వస్తున్న నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. ప్రకృతి వ్యవసాయంతో పండించిన ఆకుకూరలు, కాయకూరలు, పప్పుదినుసులను ప్రతి సోమవారం అందుబాటులో ఉంచుతున్నామన్నారు. మార్కెట్ యార్డుల్లో స్టాల్స్‌ను ఏర్పాటు చేయబోతున్నట్లు తెలిపారు.

కందుకూరు సబ్ కలెక్టర్‌గా హిమవంశీ


హిమవంశీ

నెల్లూరు(అర్బన్)/కందుకూరు: కందుకూరు సబ్ కలెక్టర్‌గా పనిచేస్తున్న తిరుమాణి శ్రీపూజను ప్రభుత్వం బదిలీ చేసింది. ఆ స్థానంలో 2023 ఐఏఎస్ బ్యాచ్‌కు చెందిన దామెర హిమవంశీని నియమిస్తూ సోమవారం రాత్రి ఉత్తర్వులు జారీ చేసింది. ఈయనది తెలంగాణ రాష్ట్రం నల్గొండ జిల్లా. శిక్షణ పూర్తి చేసుకున్న హిమవంశీ మొదటి పోస్టింగ్‌లో కందుకూరు సబ్‌కలెక్టర్‌గా నియమితులయ్యారు. శ్రీపూజకు ప్రస్తుతానికి ఎక్కడా పోస్టింగ్‌కు ఇవ్వలేదు. దాదాపు ఏడాదిపాటు సబ్ కలెక్టర్‌గా పనిచేసిన ఆమెను ఆకస్మికంగా బదిలీ చేయడం అధికార వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది.

కండలేరులో 25.634 టీఎంసీలు

జలాశయం (ఫైల్)


రాపూరు: కండలేరు జలాశయంలో సోమవారం నాటికి 25.634 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు ఈఈ గజేంద్రరెడ్డి తెలిపారు. సత్యసాయి గంగ కాలువకు 1,750, పిన్నేరు కాలువకు 20, లోలెవల్ కాలువకు 190, మొదటి బ్రాంచ్ కాలువకు 85 క్యూసెక్కుల వంతున నీటిని విడుదల చేస్తున్నట్లు వెల్లడించారు.